క్లుప్తంగా

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల పరిశీలన



డిచ్‌పల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను గురువారం నిజామాబాద్ ఆర్డీవో రవి పరిశీలించారు. ధర్మారం(బి) ఉన్నత పాఠశాల, బర్ధిపూర్ శివారులోని సుధీర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల భవనాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సామగ్రితో పాటు రిసెప్షన్ సెంటర్లను ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో రెండు పంపిణీ కేంద్రాలను ఎంపిక చేసి పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఆర్ఐ సంతోష్, పాఠశాల హెచ్ఎం ఉషశ్రీ, తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐ సతీశ్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని నార్త్ సీఐగా గురువారం సతీష్ బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని తాండూర్ సీఐగా ఉన్న సతీష్‌ను నిజామాబాద్ నార్త్ సీఐగా బదిలీ చేశారు. సీఐ భూక్య నరహరి, సీఐ సతీష్‌కు బాధ్యతలను అప్పగించారు.

ఆర్థిక సాయం అందజేత



ధర్పల్లి: రేకులపల్లి గ్రామానికి చెందిన గజ్జల లక్ష్మణ్, పోతున్నూర్ తాండాకి చెందిన ధరావత్ రమేష్ నాలుగు రోజుల క్రితం రేకులపల్లి గ్రామంలో బోర్ మోటార్ వద్ద మరమ్మతులు చేసేటప్పుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ రెడ్డి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అండగా ఉంటామని పేర్కొన్నారు. నాయకులు బాల నర్సయ్య, చెలిమేల నర్సయ్య, సుధాకర్, గంగారెడ్డి ఉన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

నిజామాబాద్‌అర్బన్: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని లిఖిత ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత ఆశయాలతో ట్రిపుల్ ఐటీకి వచ్చి విద్యను అభ్యసిస్తారనుకుంటే ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, వేధింపుల వల్లే విద్యార్థులు వరుస ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

దరఖాస్తుల గడువు పెంచాలి



ఖలీల్‌వాడి: బీసీ కులవృత్తులకు ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బీఎల్‌పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలో దండి వెంకట్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 20 లోపు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది.. కానీ ఆన్‌లైన్‌లో సర్వర్ సమస్యతో బిజీగా వస్తోందన్నారు. మరోవైపు కులం సర్టిఫికెట్ ఇవ్వడానికి తహసీల్దార్‌లు ఇబ్బందులు కలిగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎక్కువగా నష్టపోయింది బీసీ కులాలేనన్నారు. గడువు మరో 20 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు.

జులై 2న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నిజామాబాద్‌నాగారం: పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు దీకొండ యాదగిరి తెలిపారు. గురువారం నగరంలో ఆయన మాట్లాడారు. జులై 2న నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు. మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పద్మశాలి సంఘం బాధ్యులు పుల్గం హన్మాండ్లు-9396483999, నర్సయ్య-9985566374, గురుచరణం-9866557115, భూమేశ్వర్-9494258585లకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

గాల్లో రైతుల ప్రాణాలు



హుస్సేన్‌నగర్ వద్ద పొలాల్లో వంగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు



పందిమడుగు వద్ద స్తంభాల స్థానంలో కర్రలు



తాటిపల్లి సమీపంలో వంగిన విద్యుత్ స్తంభం

- సిరికొండ పరిధిలో విద్యుత్ మరమ్మతులపై నిర్లక్ష్యం
- మొద్దు నిద్ర వీడని ట్రాన్స్‌కో

సిరికొండ : ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంతో రైతుల ప్రాణాలు గాలిలో దీపంగా మారుతున్నాయి. వ్యవసాయ అవసరాలకు తగినన్ని పరికరాలను సరఫరా చేయకపోవడంతో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో ఎక్కువ మొత్తంలో బోరుబావులపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. బోరుబావులు నడవడానికి విద్యుత్తు ప్రధాన వనరు. కానీ ఆ విద్యుత్ పరిస్థితి చూస్తుంటే మాత్రం రైతన్న గుండె మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌కో నిర్లక్ష్యంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి దాపురించింది. మండలంలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు 500పైగా వివిధ రకాల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరైన పరికరాలు లేక ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లను బంద్ చేయడానికి సరైన పరికరాలు లేకపోవడంతో వాటి స్థానంలో కర్రలను అమర్చుకొని రైతులు నానా తంటాలు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని రైతులు వాపోతున్నారు. గద్దెలు వంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా చాలా మటుకు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నెలకొని ఉన్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇక వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పొలాల్లో ఎక్కడ చూసినా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలే దర్శనమిస్తున్నాయి. పొలాల్లో చేతికి అందేలా ఉన్న తీగలను సవరించలేని దుస్థితిలో ట్రాన్స్‌కో కొట్టుమిట్టాడుతోంది. నేలను తాకేలా ఉన్న తీగలతో గతంలో పలు మార్లు ప్రమాదాలు జరిగినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. వర్షం కురిస్తే తేమతో కర్రలను బిగించుకున్న చోట విద్యుత్ ప్రసారం జరిగి పెద్ద ప్రమాదం సంభవించే అవకాశాలు లేకపోలేదు. సరైన పరికరాలను ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలో జరిగిన ఘటనలు..

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఆయా గ్రామాల్లో కరెంట్ షాక్‌తో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

- న్యావనంది గ్రామంలో ఏప్రిల్ నెలలో జరిగిన ప్రమాదంలో మామిడికింది నారాయణ అనే రైతు మృతి చెందాడు.
- హోన్నాజీపేట్ గ్రామ పరిధిలోని తండాలో రాత్రి వేళ నీరు పారించేందుకు వెళ్లిన మహిళ కిందికి వేలాడే తీగలతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.
- ఐదేళ్ల కిందట నర్సింగ్‌పల్లిలో పొలం వద్ద స్తంభానికి సపోర్ట్ వైరుకు బొక్క లేకపోవడంతో కరెంట్ ప్రసారమై విద్యార్థి ప్రాణాలు వదిలాడు.
- పలు గ్రామాల్లో మేత మేస్తూ స్తంభాలకు తగిలి పశువులు మరణించిన ఘటనలు కోకొల్లలు. గత వారంలో సర్పల్లి తండా సమీపంలో విద్యుత్ స్తంభాన్ని తాకి ఆవు మరణించింది.
- సిరికొండ సెక్షన్ పరిధిలో గల ధర్పల్లి మండలంలోని రేకుల్‌పల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.



పోతున్నూర్ శివారులో చేతికి అందేలా ఉన్న తీగలు

వేధిస్తే ఉద్యమం తప్పదు


ఖలీల్‌వాడి: కొత్త మెనూ ప్రకారం పెట్టాలని మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తే ఉద్యమం తప్పదని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ హెచ్చరించారు. గురువారం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి, కులాస్‌పూర్, డిచ్‌పల్లి కేంద్రాలలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అధ్యయనం చేశారు. గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం కొత్త మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందిస్తామని ప్రకటించింది.. అందుకు అనుగుణంగా స్లాబ్ రేట్లు నిర్ణయించకుండా అమలు చేయాలనడం ఎంత వరకు సమంజసమన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



ఖలీల్‌వాడి: నగరంలోని 5వ డివిజన్ బోర్గాం (పి) అల్లూరి సీతారామరాజు కాలనీవాసులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం కాలనీవాసులతో కలిసి ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రాకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు సాయాగౌడ్, గణేష్, అషర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సంప్రదాయ విద్యను నేర్పించాలి



నిజామాబాద్ సిటీ: విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యతో పాటు సంప్రదాయ విద్యను కూడా నేర్పించాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. గురువారం స్థానిక కిషన్ గంజ్ ఇందూరు విజయ యాత్ర, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు తీసుకోవాల్సిన పలు అంశాలపై భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. పిల్లలలో సంప్రదాయ విద్యలను నేర్పించడం వల్ల ఆత్మవిశ్వాసం, ఆలోచన, ఏకాగ్రత, సృజనాత్మకత బాగా పెరుగుతుందని అన్నారు. పిల్లలకు చిన్న తనం నుంచి ధార్మిక చింతన కల్పిస్తే పెద్దయ్యాక గొప్ప వ్యక్తులుగా రాణించి తల్లిదండ్రులకు సమాజానికి గొప్ప పేరు తీసుకువస్తారని అన్నారు.

సమస్యలపై ప్రభుత్వానిది నిర్లక్ష్య ధోరణి

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులు, పెన్షనర్లు, వారి సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్-రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు ఆరోపించారు. గురువారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో పెన్షనర్ల సమావేశం జరిగింది. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. కాల పరిమితి ముగిసినా పీఆర్సీ కమిటీని వేయలేదని, బకాయి పడ్డ డీఏలు ఇంతవరకు మంజూరు కాలేదన్నారు. నగదు రహిత వైద్యం గురించి గతంలో చెప్పిన మాటలు ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదన్నారు. జిల్లా నాయకులు జార్జ్, భోజరావు, శిర్ప హనుమాన్లు ఉరు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

నా భూమి నాకు ఇప్పించండి



నిజామాబాద్‌నాగారం: ధర్పల్లి మండలం కేసారం శివారులో సర్వే నంబర్-79లో ఉన్న 21 గుంటల తన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని భూమిని ఇప్పించాలని దమ్మన్నపేట్ గ్రామానికి చెందిన యమున అనే వృద్ధురాలు కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నాకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పట్టా పాసు పుస్తకంతో పాటు రైతు బంధు ఇస్తున్నట్లు తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూమిని నేను గ్రామంలో లేని సమయంలో కొంతమంది కబ్జా చేశారని తెలిపారు. ఇదే భూమిలో జీపీ భవనంతో పాటు, హరితహారం కింద మొక్కలు నాటారు. ఇదే విషయాన్ని గ్రామ పంచాయతీలో అడిగితే నీవు కాటిక దగ్గర ఉన్నావని, నీకు ఎందుకు భూమి అంటూ హేళనగా మాట్లాడారన్నారు. స్థానిక తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్‌కు విన్నవించానని చెప్పారు.

కొత్త జీపీ భవనాలకు భూమిపూజ

నిజామాబాద్ సిటీ: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సొంత భవనాలు లేని గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు భూమి పూజ కార్యక్రమాలు జరిగాయి. నిజామాబాద్ రూరల్ మండలం గాంధీ నగర్, చక్రధర్‌నగర్ తండా, గాంధీనగర్ గ్రామాలలో గురువారం మండల ఎంపీపీ బానోత్ అనూష, జెడ్పీటీసీ సుమలత, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ హరిచంద్‌లు కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



చక్రధర్‌నగర్ తండాలో భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవం



మోపాల్‌లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న సర్పంచ్ రవి



సిరికొండలో.. సర్పంచ్ రాజారెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పలు చోట్ల బతుకమ్మ, బోనాల వేడుకలు నిర్వహించారు. గ్రామసభలు ఏర్పాటు చేశారు. పల్లెప్రగతి అభివృద్ధి పనులపై ర్యాలీలు నిర్వహించి ఫొటోలు ప్రదర్శించారు.



చంద్రాయన్‌పల్లిలో పంచాయతీ సిబ్బందికి సన్మానం



కేశాపూర్‌లో సఫాయి కార్మికుడికి..



పడకల్‌లో ..



నడిపల్లి గ్రామ పంచాయతీలో ..

షిఫ్టింగ్ పర్మిషన్ ఎలా ఇచ్చారు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల

నిజామాబాద్‌నాగారం: సుభాష్‌నగర్ ప్రాంతంలోని లిబర్టీ పాఠశాల నిర్మాణ దశలో ఉన్న బిల్డింగ్‌కు షిఫ్టింగ్ పర్మిషన్ ఎలా ఇచ్చారని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం(ఏఐపీఎస్‌యూ) నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల ప్రశ్నించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారుల తీరు పట్ల వాళ్లు చేస్తున్న అక్రమాల పట్ల స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయానికి సంబంధించి మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యా శాఖాధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. అరవింద్, నవీన్, సంజీవ్, ఆకాష్, నరేష్ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

జీవాలను కట్టడి చేయండి సారూ!



ఖలీల్‌వాడిలోని డీసీసీబీ బ్యాంకు వద్ద ఆవుల మంద

సుభాష్‌నగర్ : నగరవ్యాప్తంగా రోడ్లపై ఆవులు, గేదెలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. గుంపులుగా సంచరిస్తుండటంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కోసారి రోడ్డుకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. వీటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి జీవాల యజమానులకు అవగాహన కల్పించాలి.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: **ప్రశాంత్, సానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఫోన్ నంబర్ : **73966 33773**

నేను చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది

– రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

ధర్పల్లి: నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తున్నాయని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ధర్పల్లి మండల కేంద్రంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండలంలో నూతనంగా నిర్మించనున్న 9 జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికులను సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ..నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో రూ.353 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి గ్రామాన్ని అందంగా తీర్చిద్దామని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు సంవత్సరానికి రూ.5 కోట్ల నిధులు వచ్చినా గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి ఇవ్వడం లేదని విమర్శించారు. జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలి'



మాట్లాడుతున్న మహేశ్ కుమార్ గౌడ్

ఖలీల్‌వాడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని అప్పుడే సామాన్యులకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా 56, 57 డివిజన్లలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశవేణు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికి తిరుగుతు బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. నగరంలో ఖిల్లా రోడ్డులోని ఓ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ....తెలంగాణాలో కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ, టీఆర్ఎస్‌లు ఒక్కటేనని ప్రజలను పక్కదారి పట్టించడానికి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమిని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు

డిచ్‌పల్లి: నడిపల్లి జీపీ పరిధిలోని ఈదుల్లా చెరువు శిఖం భూమిని కబ్జా చేసి కొందరు ప్రహరీ నిర్మిస్తున్నారని, వెంటనే వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ గురువారం డిచ్‌పల్లి ఆర్ఎస్ వీడీసీ సభ్యులు తహసీల్దార్ శ్రీనివాసరావ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బంది అక్కడికి పంపించి నిర్మాణ పనులను నిలిపివేయించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,900	వెండి (కిలో)	75,200
22 క్యారెట్స్	56,147		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	క్యాప్సికం	60	80
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	50
జీరకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
దొండకాయ	25	50	దోసకాయ	10	20
జిర్నిసుకాయ	150	200	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	35	50	గోబిగడ్డ	20	40
వంకాయ	20	40	గోబిపువ్వు	30	50
పాలకూర	40	60	బీట్‌రూట్	30	50
మెంతికూర	70	90	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	70	90	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆది పురుష్(తెలుగు) -9.00,12.30 4.00,7.30,10.55
స్క్రీన్-2	ఆది పురుష్(తెలుగు) -9.30, 1.00, 7.15
	ది ఫ్లాష్(ఇంగ్లీష్)2డీ -4.30, 10.45
స్క్రీన్-3	ది ఫ్లాష్-(ఇంగ్లీష్) - 11.00,1.50 4.40,7.30,10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆది పురుష్(తెలుగు)- 3డీ -8.00, 11.45,3.30,7.15,11.00
స్క్రీన్-2	ఆది పురుష్(తెలుగు) -3డీ-11.00, 2.45,6.30,10.15
స్క్రీన్-3	ఆది పురుష్(తెలుగు)- 2డీ -10.30 2.15,6.00,9.45
స్క్రీన్-4	ది ఫ్లాష్(తెలుగు) -12.45
దేవి	ది ఫ్లాష్-(ఇంగ్లీష్)-2డీ
నటరాజ్	ఆది పురుష్(హిందీ)
లలితామహల్	ఆది పురుష్(తెలుగు)
విజయ్	ఆది పురుష్(తెలుగు)